క్లుప్తంగా

జాతీయస్థాయి టార్గెట్‌బాల్ పోటీల్లో స్వర్ణపతకం



జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన విద్యార్థులు



రజత పతక విజేత విజయ్

చాగల్లు: గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు ఆగ్రాలో జరిగిన టార్గెట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ఆర్.నవ్య, ఇ.హారిక, జి.రోషిణి, శాంతి, డి.మౌనిక, దుర్గ స్వర్ణ పతకం సాధించినట్టు స్థానిక జెడ్పీ హైస్కూల్ పీడీ విజయలక్ష్మి తెలిపారు. వారి సాధనకు సఫీజ్ ఆర్థికంగా సహకరించారని ఆమె వివరించారు. పురుషుల విభాగంలో జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వి.విజయ్ రజత పతకాన్ని సాధించినట్టు ఆమె తెలిపారు. వారి విజయంపై హెచ్‌ఎం మోహన్‌కృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ గోపాలకృష్ణ, తల్లితండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పలువురికి పరామర్శ

తాళ్లపూడి: మండలంలోని ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కొర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం పరామర్శించారు. అన్నదేవరపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మేణ్ణి సురేష్ నాయనమ్మ మేణ్ణి బంగారమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే పార్టీ నాయకుడు ఎలిపే ప్రకాష్ తల్లి సరోజిని ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్ పాల్గొన్నారు.

నల్లజర్లకు పాఠ్యపుస్తకాలు

నల్లజర్ల: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు గురువారం మండల విద్యావనరుల కేంద్రానికి చేరాయి. మండలంలో 1 నుంచి 10 తరగతులకు ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా 17,122 పుస్తకాలు వచ్చినట్టు ఎంఈఓ-2 యం.భగవతి తెలిపారు.

మృతదేహం గుర్తింపు



సత్యనారాయణ (ఫైల్)

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి నదిలో దూకి గల్లంతైన కోట్ల సత్యనారాయణ (78) మృతదేహాన్ని గురువారం సాయంత్రం ఎరినమ్మ ఘాట్‌లో గుర్తించారు. పట్టణానికి చెందిన సత్యనారాయణ బుధవారం సాయంత్రం దుస్తులు వంతెనపై విడిచిపెట్టి నదిలోకి దూకాడు. ఈయన ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలు ఏమిటనేది ఇంకా తెలియరాలేదని పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. మృతుడి మనవడు ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

ఆటాడుకుందాం రా..

- యోగా, చెస్, వాలీబాల్‌లో తర్ఫీదు
- ఆసక్తి చూపుతున్న బాలబాలికలు
- ఉత్సాహంగా శిబిరాలు ప్రారంభం

నల్లజర్ల: ఆటల సమయం ఆసన్నమైంది. పాఠశాలలకు సెలవులు రావడంతో బాలబాలికలు ఆటలపై ఆసక్తి చూపుతున్నారు. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు ఆటలతో సేదతీరేందుకు సిద్ధమవుతున్నారు. గురువారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు నెలరోజుల పాటు పిల్లలను మానసికంగా, శారీరకంగా బలవంతులను చేయడానికి ఈ క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని క్రీడా నిపుణులు చెబుతున్నారు. వేసవి శిక్షణతో భవిష్యత్తులో పిల్లలను మంచి క్రీడాకారులుగా తయారవుతారని చెబుతున్నారు. క్రీడాభిమానుల మన్ననలు అందుకున్న క్రికెటర్ సచిన్ టెండుల్కర్, బ్యాడ్మింటన్ ప్లేయర్లు సైనా నెహ్వాల్, శ్రీకాంత్‌లు వేసవి శిక్షణ శిబిరాలలో సాధన చేయడం ద్వారా వెలుగులోకి వచ్చిన వారేనని వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన నల్లజర్ల సీఐ రాంబాబు, ఎస్‌ఐ కె.రమేష్ పేర్కొన్నారు. మండలంలో దూబచర్లలో సంఘమిత్రా స్కూలు ఆవరణలో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగా, చెస్, వాలీబాల్ శిక్షణ శిబిరాలు గురువారం ప్రారంభమయ్యాయి.



యోగాలో శిక్షణ పొందుతున్న బాలబాలికలు



చెస్‌లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు



దూబచర్లలో వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ రాంబాబు

క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో



12 ఏళ్లగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో దూబచర్లలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. 8 నుంచి 14 ఏళ్ల బాలబాలికలకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నాం. మొదటి రోజు నుంచే బేసిక్స్ నేర్పుతాం. ఆసనాలతో పాటు, సూర్యనమస్కారాలు నేర్పుతున్నాం. యోగాకు 40 మంది, చెస్‌కు 30 మంది, వాలీబాల్‌కు 20 మంది విద్యార్థులు హాజరయ్యారు.

– దూబగుంట్ల రాజారావు, పీఈటీ, దూబచర్ల జెడ్పీ హైస్కూలు

పిల్లల్లో ఆసక్తిని గుర్తించాలి



తల్లిదండ్రులు ముందుగా పిల్లల్లో ఆసక్తిని గుర్తించాలి. వారికి ఏ ఆటలపై మక్కువ ఉందో తెలుసుకుని శిబిరానికి పంపాలి. పిల్లాడు మానసిక, శారీరక స్థితి గుర్తించి శిబిరంలో కోచ్‌కు తెలియజెప్పి దానికి అనుగుణంగా శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలి. తమ ఇద్దరు పిల్లలను నల్లజర్ల నుంచి దూబచర్లకు తీసుకువచ్చి క్రీడల్లో తర్ఫీదు ఇప్పిస్తున్నాను.

– టి.ప్రసాద్, విద్యార్థుల తండ్రి, నల్లజర్ల

మహానేతకు విముక్తి

సాక్షి ఇంపాక్ట్



విగ్రహానికి ముసుగు తొలగించిన అధికారులు

నిడదవోలు: ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌లో భాగంగా గత ఫిబ్రవరిలో పట్టణంలోని వైఎస్సార్‌నగర్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వేసిన ముసుగును గురువారం తొలగించారు. కోడ్ ముగిసిన తొలగని ముసుగు శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి టౌన్ ప్లానింగ్ అధికారి సుప్రియ స్పందించి తన సిబ్బందితో వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగు తొలగించారు.

కార్మికులకు సత్కారం



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న పెన్షనర్లు

నిడదవోలు: పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ భవనంలో పురపాలక సంఘం పారిశుధ్య కార్మికులు బంగారు శివగంగ, మిడిపల్లి కృష్ణవేణి, గుడుపు అప్పారావు, బంగారు సింహాద్రిలను ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు బలగం అప్పారావు, కీర్తి ఆంజనేయులు, కేవీస్వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన ఎర్ర జెండాలు

- ఘనంగా మేడే వేడుకలు
- కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు



నిడదవోలులో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన చేసున్న కార్మికులు

కొవ్వూరు: ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే స్ఫూర్తితో ఎనిమిది గంటల పని విధానం కోసం పోరాడుదాం, లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఉద్యమిద్దామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు ప్రకటించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే ఘనంగా నిర్వహించారు. సీతంపేట జంక్షన్‌లోను, వాడపల్లి గోదావరి ఏటిగట్టుపైన, బ్రిడ్జిపేటలో, కోరమాండల్ రైల్వే స్లీపర్ కంపెనీ వద్ద, పుంత ముసలమ్మ గుడి జంక్షన్, పెయింటర్స్, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్, మార్కెట్ బజార్ జట్టు కార్మికుల ఆధ్వర్యంలో బాపూజీ మార్కెట్ వద్ద, మసీదు వీధిలో, కొవ్వూరమ్మ గుడి జంక్షన్ వద్ద, మునిసిపల్ కార్యాలయం వద్ద, నందమూరు రోడ్డు జంక్షన్, బస్టాండ్ సమీపంలో చైతన్య తాపీ వర్కర్స్ యూనియన్, ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు. బస్టాండ్ సెంటర్‌లోని వేడుకల్లో జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ, కార్మిక శాఖ అధికారి ఆలోచన పాల్గొన్నారు. కార్మిక సంఘం నాయకులు పలపాల సూర్యచంద్రరావు, మద్దూకూరి దొరయ్య, మైగాపుల నాగేశ్వరరావు, మానికిరెడ్డి హరిబాబు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..

ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణంలోను, ఐ.పంగిడి, దేచెర్ల గ్రామాల్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోదావరిలో డ్రెడ్జింగ్ పడవల ద్వారా ఇసుక సేకరణ నిషేధాన్ని అధికారులు కచ్చితంగా అమలు చేయాలని పడవ కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకు జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహించారు. గోదావరి మాత మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు ఎం.చంద్రరావు పాల్గొన్నారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: వ్యవసాయ కార్మిక సంఘం, క్వారీ కార్మిక సంఘం, క్వారీ లారీ వర్కర్ల యూనియన్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నేతలు మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. దుద్దుకూరులో ప్రగతిశీల కార్మిక సంఘం కార్యాలయం వద్ద రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు గౌరీపట్నం నుంచి దేవరపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీపురంలో ఏఐఎఫ్‌టీయూ (న్యూ), రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోలుమాటి పెంటయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు. దేవరపల్లి, త్యాజంపూడి గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ పతాకాలను మండల గౌరవాధ్యక్షురాలు టీపీ లక్ష్మి, త్యాజంపూడిలో వారా కృష్ణరావు ఆవిష్కరించారు. మండల కార్యదర్శి భగత్ మాట్లాడుతూ 20వ తేదీన జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. మండలంలో 22 అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మేడే వేడుకలను నిర్వహించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. వెంకటలక్ష్మి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నల్లజర్లలో..

నల్లజర్ల: ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా మండలంలోని దూబచర్ల, నల్లజర్ల, పోడవరం, తెలికిచర్ల, పోతవరం గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు, బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సీఐటీయూ జిల్లా నాయకులు కొక్కిరపాటి వెంకట్రావు, బొంగు వీరభద్రరావు, సంగవరపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే నల్లజర్ల సెంటర్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు బాలయ్య, ఆలీ సాహెబ్ పతాకావిష్కరణలు చేశారు. జిల్లా కార్యదర్శి మనోహరకుమార్, మండలప్రధాన కార్యదర్శి బండి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ఎనిమిది గంటల పని విధానాన్ని పోరాటాల ద్వారా సాధించుకున్నామని, ఎవరి భిక్షా కాదని యూటీఎఫ్ జిల్లా నాయకులు జయకర్ పేర్కొన్నారు. మండలంలో గురువారం సీఐటీయూ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు ఎర్ర జెండాను ఆవిష్కరించారు. అనంతరం రైస్‌మిల్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. వివిధ సంఘాల నాయకులు దూళ్ల గోపాలరావు, ఉప్పె కేదారేశ్వరరావు, జేవీ కుమారి తదితరులు పాల్గొన్నారు. ఈశ్వర యేసు కార్మిక సంఘ అధ్యక్షుడు మైగాపుల ఆంజనేయులు, వేగేశ్వరపురంలో సీఐటీయూ అనుబంధ సంస్థ అధ్యక్షులు జన్నేపల్లి నాగరాజు, దేవన సత్యనారాయణ తదితరుల ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు.

గోపాలపురంలో..

గోపాలపురం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మేడే నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఏఎస్‌వీ మహేష్ పాల్గొని మాట్లాడుతూ కార్మికులకు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హమాలీలు, బిల్డింగ్ కార్మికులు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో గణపతి సెంటర్‌లో కార్మికులతో సభ, అనంతరం ఎర్రజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ మండల అధ్యక్షులు గంటి కృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ చికాగోలోని హే మార్కెట్ అమరుల త్యాగాలతో 8 గంటల పని హక్కును సాధించుకోవడంతో పాటు పెట్టుబడిదారి దోపిడీకి వ్యతిరేకంగా సాగే పోరాటంలో ప్రపంచకార్మిక వర్గాన్ని మేడే ఏకతాటిపైకి తెచ్చిందన్నారు. నాయకులు ఒ.ప్రదీప్, పైడియ్య, ఎ.డేనియల్, మిరియాల ధనరాజు తదితరులు పాల్గొన్నారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికవర్గానికి కార్మిక సంఘం చేయాతనివ్వాలన్న సందేశంతో చేతికర్ర నాటకాన్ని ప్రదర్శించారు. తీపర్తి వీర్రాజు మేడే జెండా విష్కరించారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: మండలంలోని ఉండ్రాజవరంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, తాడిపర్రులో కొబ్బరి వలుపు కార్మికులు, మోర్తలో సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఎర్ర జెండాను ఎగురవేశారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. తాడిపర్రులో శ్రీసిద్ధి వినాయక భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఈసీజీ, బీపీ షుగర్ టెస్ట్‌లు నిర్వహించి మందులు అందజేశారు. ఉండ్రాజవరం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మాచినేని మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు బూరుగుపల్లి సుబ్బారావు, గన్నమని వెంకట సుబ్బారావు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు అండ ఎర్రజెండా

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి, శెట్టిపేట, సింగవరం, పెండ్యాల, కోరుపల్లి గ్రామాల్లో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడాలని సీఐటీయూ నాయకులు జువ్వల రాంబాబు తదితరులు పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో ఐఎఫ్‌టీయూ నాయకులు ఈమని గ్రీష్మకుమార్, నాయకులు ఖండవల్లి వీర వెంకట్రావు, నూతంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో..

చాగల్లు: స్థానిక మెయిన్ బజార్‌లో సీపీఎం కార్యదర్శి కామిశెట్టి కనకదుర్గారావు ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించి కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆశా కార్మిక అధ్యక్షులు కె.పోచమ్మ పాల్గొన్నారు. బిల్డింగ్ వర్కర్స్ స్థూపం వద్ద ఆ యూనియన్ కోశాధికారి కల్లేపల్లి తాతారావు, బిల్డింగ్ వర్కర్స్ కార్యాలయం వద్ద యూనియన్ ప్రెసిడెంట్ తంగేళ్ల కొండయ్య, సీఐటీయూ జెండాను రైతు సంఘ నాయకులు గారపాటి సుబ్బారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ కార్యదర్శి ఎస్‌కే ఆదం, రైతు నాయకులు సంకటాల బుద్ధుడు, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు తాళ్లూరు మూర్తి, కిరణ్ తదితరలు పాల్గొన్నారు.



దూబచర్లలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



తాళ్లపూడిలో సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో..



దేవరపల్లి మండలం లక్ష్మీపురంలో..



కొవ్వూరు అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద..

పచ్చని తోటలకు ఎండల చిచ్చు

- తెగుళ్లు సోకి చనిపోతున్న తోటలు
- విరిగిపోతున్న అరటి బొందలు
- అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటలకు తీవ్ర నష్టం
- అరటి, కంద, దొండ, కొబ్బరి దిగుబడిపై ప్రభావం



ఖండవల్లిలో మాడిపోతున్న అరటి తోట

పెరవలి: భానుడి భగభగలకు పచ్చని చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. పచ్చని అరటి తోటలు ఎండ వేడికి కాలిపోయినట్లుగా ఎండిపోతున్నాయి. పెరవలి మండలంలో వరి తరువాత అరటిని 4,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కాలువలను మూసివేయడంతో బోర్లపైనే సాగునీరును అందిస్తున్నారు. కాలువ కట్టే సమయంలో వాణిజ్య పంటలకు, మెట్ట పంటలకు సాగునీరు ఒక తడి ఇవ్వాల్సి ఉండగా ఇరిగేషన్ అధికారులు తడిని ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఆనాటి నుంచి 15 రోజులుగా ప్రతి వారం బోర్లపై సాగునీరు అందిస్తున్నారు.

భూమిలో తేమ శాతం తగ్గడంతోనే ఈ పరిస్థితి

వడగాల్పులు, భానుడి ప్రతాపానికి ఈ పచ్చని చెట్లు ఎండిపోతున్నాయి. వేడిగాలుల వలన భూమిలో తేమ శాతం తగ్గిపోవడంతో ఆ ప్రభావం చెట్లపై పడి ఆకులు మాడిపోతున్నాయి. పంటలు కాపాడుకోవడానికి రైతులు ఎన్ని విధాలుగా కృషి చేస్తున్నా సూర్య ప్రతాపం కారణంగా ఫలితం కనిపించడం లేదు. ఈనిక దశలో, ఈనిన అరటి తోటలు మాడిపోతున్నాయి. అరటి గెలు పక్వానికి రాకుండానే ముగ్గిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అరటి చెట్లు ఎండలకు ఎండిపోతున్నాయో, తెగులు సోకి చనిపోతున్నాయో తెలియక రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పచ్చనితోటలపై ప్రకృతి పగబట్టినట్లుగా తోటలు మాడిపోతున్నాయి.దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు.

దొండ పాదులకు వైరస్ తెగుళ్లు

ఇప్పటికే దొండ పాదులకు వైరస్ తెగుళ్ల సోకడంతోపాటు ఎండలకు ఎండిపోతున్నాయి. ఇప్పుడు పచ్చిమిరప తోటలు, కంద, అరటి, కొబ్బరి తోటలు మలమలామాడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెరవలి మండలంలో కూరగాయల పంటలు ఈ ఎండలకు, వడగాడ్పులకు నామరూపాల్లేకుండా పాడైపోయాయి. పచ్చిమిరప తోటలు మంచి దిగుబడి ఇచ్చే సమయంలో నిలువునా ఎండిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో పెరవలి, నల్లాకులవారిపాలెం, ముక్కామల, బొక్కావారిపాలెం, ఉమ్మిడివారిపాలెం, లంకమాలపల్లి, ఖండవల్లిలో సుమారు 150 ఎకరాల్లో పచ్చిమిరప సాగు చేస్తున్నారు. ఈ పంటలన్నీ మాడిపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారు. కందతోటలు అధిక ఉష్ణోగ్రతలకు ఎండిపోతుండటంతో ఆ రైతులు అల్లాడిపోతున్నారు. కంద గొడుగులు ఏపుగా పెరిగి దుంప ఏర్పడే సమయంలో మొక్కలు మాడిపోవడంతో దుంప సక్రమంగా పెరగక తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు చెబుతున్నారు. ఇలా ప్రతి పంట తెగుళ్ల, ఎండల వలన దెబ్బతినడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

వేడి గాలుల నుంచి రక్షణ చర్యలు

అరటి చెట్లు గెలలు వేయగానే కర్రలతో గెడలు సపోర్టుగా ఏర్పాటు చేయాలి. గెలలకు ఎండిన అరటి ఆకులను చుట్టాలి. వడగాల్పులు ఉన్నప్పుడు గెలలు కోయరాదు. పక్వానికి వస్తే ఉదయమే గెలలు కోసి నీడన ఉంచాలి. వేడి గాలుల నుంచి రక్షణ కల్పించేందుకు తోటల చుట్టూ అవిస మొక్కలను 2 లేక 3 వరసలలో నాటాలి. నీటి తడులు క్రమం తప్పకుండా పెట్టాలి. ప్రతి పది రోజులకు ఒకసారి పొటాషియం సల్ఫేట్ (0.05 శాతం) మందును జిగురు మందుతో కలిపి చెట్లు తడిసే విధంగా పిచికారీ చేస్తే ఉష్ణోగ్రతల నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

– సీహెచ్ శ్రీనివాస్, ఉద్యానవన అధికారి, కొవ్వూరు



అన్నవరప్పాడులో ముగ్గిపోతున్న కందతోట



నల్లాకులవారిపాలెం వద్ద ముగ్గిపోతున్న కొబ్బరి చెట్లు



ముక్కామలలో నిలువునా విరిగిపోతున్న అరటి చెట్లు

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సతీష్‌కుమార్

గోపాలపురం: మండలంలోని వెంకటాయపాలెం రొయ్యల చెరువు వద్ద విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతిచెందినట్లు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా డేగలగూడ గ్రామానికి చెందిన బిట్టిగ ప్రశాంత్ (21) వెంకటాయపాలెం రొయ్యల చెరువు వద్ద పనిచేస్తున్నాడు. విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్ వైరు తగలడంతో ప్రశాంత్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అతనిని తోటి కూలీలు గోపాలపురం సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.

బాలిక అదృశ్యం



గెల్లా స్వాతి

గోపాలపురం: మండలం భీమోలు గ్రామానికి చెందిన గెల్లా స్వాతి కనిపించడం లేదని ఆమె తల్లితండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు. బాలిక 30వ తేదీ ఉదయం ఇంటి వద్ద నుంచి వెళ్లినట్లు తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు 94407 96665 నంబరుకు సంప్రదించాలని ఎస్సై కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఉండ్రాజవరం: మరమ్మతుల నిమిత్తం ఉండ్రాజవరం, మోర్త సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా తాడిపర్రు, వెలగదుర్రు, ఉండ్రాజవరం, సత్యవాడ, మోర్త, దమ్మెన్ను విని యోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.